మహిళ నుంచి బంగారం చోరీ

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం కొర్లాం పంచాయతీ హుకుంపేట కాలనీ సమీపంలో మంగళ వారం రాత్రి పాలు అమ్మడానికి వెళ్తున్న బంగారు దమయంతి అనే మహిళ చెవిలోను, ముక్కులోను ఉన్న బంగారు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దొంగిలించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే సోంపేట సీఐ మంగరాజు, బారువ ఎస్సై హరిబాబు నాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

విశాలాంధ్ర - పలాస : కేంద్ర బీజేపీ కూటమి ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించాలే తప్ప కేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్ పై రు.50లు పెంచడం దారుణమన్నారు. గతంలో రూ:400లు ఉండే సిలిండర్ ధర రూ:880లకు పెరిగిందని దీనివల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగదారులకు పెద్ద భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై సంవత్సరానికి రు.400 కోట్ల భారం మోపుతున్నదని అన్నారు.గ్లోబల్ మార్కెట్ లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉందని అన్నారు. పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజు సుంకాన్ని లీటర్ కు రూ:2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తాజా పెంపుతో లీటర్ పెట్రోల్ పై రూ:13, డీజిల్ పై రూ:10 అమల్లోకి రానుందని అన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇందనాలపై 9సార్లు సుంకాన్ని పెంచిందని దీనతో కేంద్రానికి 99,000 కోట్ల ఆదాయం సమకూర్చుకుందని విమర్శించారు. పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజలు మద్దతుతో పోరాటాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పలాస కార్యదర్శి ఎన్ గణపతి, సిపిఎం సభ్యులు కె సుహాసిని, ఎన్ డిల్లేశ్వరి, తెప్పల అజయ్ కుమార్, కె బాలాజీ, మహాలక్ష్మి, బి శశిరేఖ, ఆటో కార్మికులు జే ఎర్రయ్య, సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహిత వరప్రసాద్‌కు సత్కారం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన మృదంగ విద్వాంసులు ప్రొఫెసర్ బొంతలకోటి వరప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందు కున్న సందర్భంగా బుధవారం రామయ్య పుట్టుగ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు వరప్రసాద్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఉద్దానం కీర్తిని రాష్ట్ర నలుమూలల తెలియజేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే వం ప్రసాద్ మాట్లాడుతూ ఉద్దానం నుంచి కాశీకి ఎవరు వచ్చిన వారికి పూర్తి సహకారం అంది స్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెందాళం రమేష్, బెందాళం సురేష్, బల్లెడ రమేష్, ప్రగడ మణి బాబు, కుసుంపురం పెద్దలు, మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు,యువకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కె. కపాసుకుద్ది గ్రామానికి చెందిన సిందిరి అపూర్వ (13) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆమె తరచూ అనారోగ్యంకు గురవుతుందని దీంతో జీవితం మీద విరక్తి మంగళవారం 6 గంటలకు తల్లి లేని సమయంలో ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఇంటికి వచ్చి చూసే సమయంకు ఉరివేసుకోవడంతో ఇరుగు పొరుగులను పిలిచి బాలికను కవిటి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన మరణంపై ఎటువంటి అనుమాలు లేవని తల్లి హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు. బాలిక తండ్రి కురమారస్వామి బెంగుళూరులో వలస కూలీగా పని చేస్తున్నాడు. చెల్లి వైజాగ్లో ఉన్న పిన్ని వద్ద చదువుకుటుంది. గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటు ఇలా జరగడంతో గ్రామంలో విశాదఛాయలు అలుముకున్నాయి.

కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - రణస్థలం : ఆంధ్రప్రదేశ్ రజక వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం బుధవారం విజయవాడలోని బీసీ భవన్లో బీసీ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమాదేవి, బోర్డు చైర్పర్సన్ సి.సావిత్రి మరియు15 మంది బోర్డు డైరెక్టర్లతో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటమి ప్రభుత్వంలో రజకుల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యిస్తున్నారని అన్నారు రజకులందరికీ ఆధారణ -3 పథకం ద్వారా సాంకేతికతో కూడిన అధునాతనమైన వృత్తి పనిముట్లను నూతన దోబీ ఘాట్ లో పాతదోబిగాట్లకు మరమ్మత్తులు చేపడు తుందన్నారు. ప్రభుత్వం రజకుల జీవన ఆర్థిక అభివృద్ధికి కుటమి ప్రభుత్వము కృషి చేస్తుందని అన్నారు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని బోర్డు సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్లు గురజాపు రాము, చంద్ర మధుసూదన్, సతీష్, దుర్గారావు, గణేష్, మధు, పల్లవరావు, నాగేశ్వరరావు, రామాంజనేయులు, మెంతారావు తదితరులున్నారు.

హోంమినిస్టర్ కలిసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. అనంతరం శ్రీకాకుళం జిల్లా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రింట్ అండ్ ఎల క్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ హెూం మంత్రిని కలిసి శాలువతోపాటు మెమొంట్ అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో గౌరవ అధ్యక్షులు పిన్నింటి అప్పన్న, అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గంజి ఎజ్రా, కలమటి నారాయణమూర్తి, ఆకుల కృష్ణ, ఉపాధ్యక్షులు బి.వేణుగోపాలరావు, ట్రెజరర్బి. మోహన్, కార్యవర్గ సభ్యులు టీ.రామకృష్ణ, ఎస్ఎస్.సాయి, ఎం.బాల తదితరులు ఉన్నారు.

డీసీఎంఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దేవరాజు

విశాలాంధ్ర - సోంపేట : పట్టణంలోని సంస్కారభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్ని దేవరాజు ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కాలేజ్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే టెక్కలి బిఎస్ అండ్ జెఆర్ విద్యాసంస్థల చైర్మన్ కోత మురళీధర్ ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర కోఆరి నేటర్‌గా ఎన్నికయ్యారు. బుధవారం కడపలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం వారిని ఘనంగా సత్క రించారు. దేవరాజు ఎన్నిక పట్ల సంస్కారభారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంకుమార్, జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సంస్కార భారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.భీమారావు, విద్యాసంస్థల సిబ్బంది, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కనుల పండగగా సీతారాముల కళ్యాణం

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో గొల్లలవలస గ్రామంలో పురాతనము నుండి సీతారామ మందిరము నందు గత 60 సంవత్స రాలుగా దేశరాజు కుటుంబం వారిచే వార్షిక కళ్యాణ మహెూత్సవాలు, నవరాత్రి మహెూత్స వాలు, పట్టాభిషేకము కార్యక్రమాలు జరుపు కుంటున్నారు. గ్రామ పురోహితులు దార్లపూడి కృష్ణాజి శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మామిడి రామశర్మ సోదరులు మరియు వేద పండితులుచే బుధవారం ఉదయం సామూహిక కుంకుమ పూజలు స్వామి వారికి అభిషేకాలు సాయంకాలం రామాలయ ప్రాంగణంలో 7 గంటల నుండి సీతారాముల కల్యాణం రంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

రీ సర్వే గ్రామంలో సరిహద్దులు గుర్తింపు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలంలో పైలెటు ప్రాజెక్టుగా ఎంపికైన డి.గొనపపుట్టుగ రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.మురళీ మోహన రావు అన్నారు. ఈ మేరకు బుధవారం సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రహితో కలసి గ్రామంలో పర్యటించి సర్వేను ప్రారంభించారు. గ్రామానికి సరిహద్దు గ్రామాలైన డి. గొనపపుట్టుగ, కపాసుకుద్ది, భైరిపురం గ్రామాల సరిహద్దులను గుర్తించారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ రమణమూర్తి, వీఆర్వోలు, గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన ఆర్టీసీ సేవలు అందించండి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : పలాస నియోజక వర్గంలో మెరుగైన ఆర్టీసీ సేవలు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణను భర్త, నియోజక వర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరితో మర్యాద పూర్వకంగా గౌతు శిరీష కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి చైర్మన్ నారాయణకు విజ్ఞప్తి చేసారు.దూర ప్రాంతాలకు పలాస కేంద్రంగా సర్వీసులు పెంచాలని, నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యాలను కల్పించాలని కోరారు, పరీక్షా కాలం అయినందున విద్యార్థులకు అంతరాయం లేని సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు.

తుపాన్ రక్షిత భవనానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం చేపల గొల్లగండి గ్రామంలో మల్టీపర్పస్ సైక్లోన్ షెల్టర్ నిర్మాణానికి మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.సత్య నారాయణ స్థల పరిశీలన చేశారు. తీర గ్రామమైన గొల్లగండిలో ఇటువంటి భవనం అవసరమని కూటమి నేతలు ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన సమన్వయ కర్త దాసరి రాజుల దృష్టికి తీసుకు వెళ్లగా వారు స్పందించి రాసిన లేఖ మేరకు అధికారులు గ్రామానికి రావడం, పరిశీలన చేయడం జరిగిందని మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గండుపల్లి చిన్నరాజారావు తెలి పారు. ఈ మేరకు గ్రామంలో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా చిన్నరాజారావు మాట్లా డుతూ చుట్టుప్రక్కల గ్రామాలైన ఇసకలపాలెం, గొల్లగండి, కొత్తూరు, ఎకువూరు, బట్టిగళ్లూరు, నదు మూరు, ఎర్రముక్కాం గ్రామాలు పూర్తిగా సముద్రానికి ఆను కుని ఉన్నాయని తుపాన్లు, భారీ వర్షాలు సమ యంలో ప్రజలకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు.

అక్కుపల్లిలో టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం అక్కుపల్లి గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపుతో పాటుగా, ప్రతి ఒక్కరికి ప్రమాద భీమా కూడా వర్తిస్తుందన్నారు. నూతన సభ్యత కార్డులను కార్యకర్తల ఇంటి వద్దకు వెళ్లి కార్డులను అందజేశారు, ఈ కార్య క్రమంలో సీనియర్ కార్యకర్త వంక తిరుపతి తోపాటు, మద్దు లక్ష్మినారాయణ,మైలపల్లి దినేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధికి చర్యలు చేపట్టండి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : పర్యాటక రంగానికి పరిశ్రమ హెూదాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత రంగాన్ని జిల్లాలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్లో పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, మార్గ నిర్దేశం చేశారు. టెక్కలిలో పట్టు మహదేవ్ కోనేరు, భావనపాడు బీచ్, కొత్తపేట కొండ, వీటితోపాటే టెక్కలిలో దివంగత నేత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట నెలకొల్పిన పార్కు అభివృద్ధికి చర్యలు చేపడుతూ, సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదే శించారు. నక్షత్ర హెూటల్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఆయా ప్రాంతాలను స్వయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక మంచి వాతావరణం ఉండే విధంగా గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు పార్కు, వంటివి సదుపాయాలు ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు పర్యటనకు వచ్చేవారంతా ఆనందాలను పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఈఈ రమణ, జెఈ మన్మధరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - పోలాకి : మండలములో ప్రజాసమస్యను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజదర్బార్ నిర్వహిస్తున్నామని శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. బుధ వారం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు వినతులు అంద జేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలు మరియు మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గత వైసిపి పాలనలో పరిష్కారంకానీ ఎన్నో సమస్యలతో ప్రజలు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. ఈ సమస్యలు అధికారులు ఎక్కడా కూడా అలసత్వం వహించకుండా తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దర్బార్ నందు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మేధా సమ్మాన్ పరీక్షకు హాజరు కావాలి

విశాలాంధ్ర - కవిటి : ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన సహాలాలపుట్టుగలో నిర్వహించే జిల్లా స్థాయి మేధా సమ్మాన్ పరీక్షకు హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆపోటా రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొళాయి, మండల శాఖ అధ్యక్షులు కేశవ పురియా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి 5 మంది విద్యార్థులు చొప్పున జిల్లా నుంచి 550 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా విద్యార్థుల ఎన్రోల్మెంటు పెంచడానికి మరియు విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ వెలికి తీయడానికి దోహద పడుతుందని ఆపోటా రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొళాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సహలాలపుట్టుగ హెచ్ఎం ప్రసన్న లిమాయి,ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్ పాడీ, కిరణ్ గౌడ, ప్రదీప్ కుమార్ గౌడ,లక్ష్మీకాంత్ బెహరా పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - పలాస : అర్హులైన డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డప్పు కళాకారుల సంఘం (కెవిపిఎస్) నాయకులు తోట సిమ్మయ్య, రుంకు రామారావు, రోకళ్ల తిరుపతి లు డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ పాత బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస జంక్షన్ వరకు డప్పులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంకినమ్మ గుడి ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు ఫలితంగా ప్రభుత్వాలు పింఛన్లు, కార్డులు మంజూరు చేశాయని కానీ ఇంకా అనేక మంది అర్హులు ఉన్నారని తెలిపారు. సాంప్రదాయ కళలకు ప్రోత్సాహం కల్పించాలంటే డప్పు కళాకారులను ఆదుకొని ముందుకు తీసుకు రావాలని కోరారు. కళాకారులందరికి గజ్జెలు, డప్పులు, డ్రమ్ములు సన్నాయి వంటి వాయిద్యాలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కారం కోసం కళాకారులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సమస్యలపై ఈ నెల 21 న ఆర్‌డిఓకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగి జనార్ధన, ఎ నాగేశ్వరావు, సిహెచ్ చరణ్, టి.భగీరది, జి.హరికృష్ణ, పి.శివరాం, జి.దాసు, ఆర్.హరికృష్ణ, కె పాపారావు, టి.రామారావు, తదితరులు పాల్గొన్నారు

తుఫాన్ ఎఫెక్ట్...సముద్రంలో మునిగిపోయిన బోటు

15 లక్షల రూపాయలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీలో గల గద్దల పాడు సముద్రపు రేవులో బుధ వారం లంగరు వేసిన బోటు మునిగిపోయింది. తుఫాన్ ప్రభావం వల్ల ముందుగానే మత్స్యకారులు సముద్ర ములో లంగరు వేసి ఉంచారు. బుధవారం ఉదయం మత్స్యకారులు యధావిధిగా తమ బోట్లు వలలు సురక్షితంగా ఉన్నాయా లేవా చూసేందుకు వెళ్లిన సమయంలో బోటు మునిగి ఉంది. దీంతో మత్స్యకారులు అప్రమత్తమై తాడుతో బోటును, వలను ఒడ్డుకు లాగారు. బోటు ధ్వంసమై బోటు ధ్వంసమై వలలు చల్లా చెదరై కనిపించకుండా పోయాయి. సుమారు 15 లక్షల నుంచి 20 లక్షల రూపాయలు నష్టం ఉంటుందని బోటు యజమాని శ్రీరంగం వీరస్వామి తోపాటు పలువురు మత్స్యకారులు తెలిపారు. సంఘటన సమాచారం తెలుసుకున్న భావనపాడు మెరైన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరారు. మత్స్యకారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కు, మత్యశాఖ అధికారులకు తెలియజేసినట్లు సర్పంచ్ శ్రీరంగం వీరాస్వామి, ఎంపీటీసీ చింతల రాజులు, మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు తెలిపారు. మత్స్యశాఖ అధికారులు జరిగిన నష్టం వివరాలను సేకరించారు.

ప్రకృతి వనరులు మాయం..!

- సూదికొండను బోడికొండగా చేస్తున్నారు
- రహదారులు పేరుతో మళ్లీ గ్రావెల్ త్రవ్వకాలు
- ఆర్డీఓ వెంకటేష్‌కు డాక్టర్ జీవితేశ్వరరావు వినతి

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ జంట పట్ట ణాల్లో గత కొంత కాలంగా ఏ పార్టీ అధికారం లోకి వస్తే ఆ పార్టీ అడ్డుపెట్టుకుని మట్టి వ్యాపారుల అవతారమెత్తి కొండలను కరిగిం చేస్తు న్నారని, చెరువులను ఆక్రమించే స్తున్నారని, ఇప్పుడు కొండలపై కన్నేసిన నాయకులు వాటిని యథేచ్ఛగా కొల్లగొడుతున్నారని సామాజిక వేత్త మరియు ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వ రావు ఆవేదన వ్యక్తం చేశారు. జంట పట్టణాలకు ప్రకృతి ప్రసాదించిన ఆభరణాలుగా ఉన్న సూదికొండ పై జరుగుతున్న అక్రమ మైనింగ్ కు ఇచ్చిన అనుమతులు రద్దుచేసి, గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతూ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వ రావు బుధవారం పలాస ఆర్డీఓ జి వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జంట పట్టణాల్లో మైనింగ్, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచుతూ ప్రకృతిని కొల్లగొడుతూ వాతావరణ సమతుల్యతను దెబ్బ తీస్తున్నారని,కంకర వ్యాపారంతో కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే మట్టి, కంకర వ్యాపారుల ధన దాహానికి కొన్ని చెరువులు కుచించుకుపోగా, కొండలు రూపు రేఖలు మారిపోయాయని ఆర్డీఓ వెంకటేష్ కు వివరించారు. గతంలో సూదికొండ లో గ్రావెల్ త్రవ్వకాలకు మైనింగ్ మరియు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తే స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు పోరాటం మేరకు అప్పటి మైనింగ్ ఆగిపోయిందని వివరించారు. జనావాసాలు, కిడ్నీ ఆసుపత్రికు సమీపంలో వున్న ఈ ప్రాంతంలో గ్రావెల్ త్రవ్వకాలకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. అక్కడ మైనింగ్ కు పర్యావరణ అనుమతులు ఉన్నాయా...? గ్రామ సభను నిర్వహించారా...? నిర్వహించి గ్రామ ప్రజల అనుమతిని తీసుకున్నారా...? మున్సిపల్ కౌన్సిల్ సమావేశ తీర్మానం చేశారా...? అసలు నిజానికి మున్సిపాలిటీ పరిధిలో మైనింగ్ అనుమతులు ఉంటాయా..? ఇన్ని నిబంధనలన్నీ ఉల్లంఘించి ఇప్పటికిప్పుడు అక్కడ కంకర త్రవ్వవలసిన పని ఏమొచ్చిందని అడిగారు. ప్రకృతి వైపరీత్యాలను నిరోధించడానికీ ప్రకృతి ప్రసాదించిన చంట పట్టణాలకు ఆభరణంగా ఉన్న కొండలపై గ్రావెల్ తవ్వకాలు వలన ఇబ్బందులపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి అనుమతులు రద్దు చేయాలని కోరారు. ఆర్డీవో వెంకటేష్ స్పందిస్తూ గ్రావెల్ త్రవ్వకాలు కోసం మైనింగ్ అధికారులతో చర్చించామని, కొండకు ఏమి ప్రమాదం ఉండదని చెప్పారు. కొండపై ఉన్న పై పొర మాత్రమే తీస్తారని, ప్రకృతి ఇబ్బంది లేకుండా త్రవ్వకాలు జరుగుతాయని వివరణ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

టౌన్ ప్లానింగ్ నిబంధనలపై అధ్యయనం చేయాలి

కార్యదర్శుల సమావేశంలో రీజనల్ డైరెక్టర్ నాయుడు

విశాలాంధ్ర - పలాస : టౌన్ ప్లానింగ్ విభాగంలో వచ్చిన నూతన నిబంధనలు, మార్పులు ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా విధులు నిర్వహించాలని టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు ఆదేశించారు. బుధవారం పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ టౌన్ ప్లానింగ్ పై సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న విధానంపై, పరిశీలన చేస్తున్న డాక్యుమెంట్ లు తదితర అంశాలను సచివాలయ కార్యదర్శులకు ప్రశ్నలు కురిపించారు. మున్సిపాలిటీ పరిధిలో ఏడాది కాలంలో ఇచ్చిన అనుమతులు, అనుమతి లేని నిర్మాణాలకు ఇచ్చిన నోటీసులు, నిబంధనను పాటించని నిర్మాణదారులపై తీసుకున్న చర్యలు వంటి అంశాలపై సమీక్షించారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రభుత్వం తీసుకున్న నూతన విధానాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రావణి, సంతోష్, మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, మున్సిపాలిటీ సర్వేయర్ చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తో పాటు లైసెన్సుడ్ సర్వేయర్లు వూన వెంకట్రావు, వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - మందస : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, శ్రీకాకుళం, మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మందస సత్య సాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,23 మందికి కంటి శుక్లంల ఆపరేషన్ అవసరమని శ్రీకాకుళం కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వీరికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్స నిర్వహిస్తారని సత్యసాయి మందిర్ కన్వీనర్ ఈశ్వర్ రావు, సేవాదళ్ సభ్యులు రామారావులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం కే.అరుణ కుమారి, సోమేశ్వర్ రావు మరియు నేత్రవైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వించారు.

మహిళలు, బాలికలు భద్రతే మొదటి ప్రాధన్యత

- మహిళలు, బాలికలు పై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టాలి
- రేంజ్ పరిధిలో గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : మహిళలు, బాలికలు భద్రతకు మొదట ప్రాధాన్యత ఇస్తూ,జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని విశాఖపట్నం రేంజ్ పరిధిలో గల పోలీస్ అధికారులను రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. రాష్ట్ర హెూం శాఖామాత్యుల వంగలపూడి అనిత శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా బుదవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి, ముందుగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం విశాఖపట్నం రేంజ్ డీఐజి గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురాన రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత వారికి పుష్ప గుచ్చాలను అందించి, ఘనంగా స్వాగతం పలికారు.రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జానపద కళాకారులు చేసిన తప్పెటగుళ్ల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం సమీక్ష సమావేశ మందిరంలో విశాఖపట్నం రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతిపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి శ్రీకాకుళం జిల్లాలో మహిళాలు, బాలికలు సంబంధించిన నేరాలు,ఫోక్సో, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు కేసులు, గ్రేవ్ ప్రాపర్టీ కేసులు నమోదు, నేర నియంత్రణ చర్యలు,కేసులు దర్యాప్తు లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,సీసీ కెమెరాలు ఏర్పాటు, డ్రోన్ కెమెరాల నిఘా,పర్యవేక్షణ,శక్తి పెట్రోలింగ్ బృందాలు పనితీరు, సిబ్బంది, వారి సంక్షేమ కార్యక్రమాలు తదితర ముఖ్యమైన అంశాలపై హెూమ్ మినిస్టర్ గారికి జిల్లా ఎస్పీ శ్రీకాకుళం జిల్లా సంబంధించిన నేర గణంకాలు తెలియజేశారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో నేర నియంత్రణ చర్యలులో భాగంగా గడిచిన 10 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశాలలో మహిళాలు, బాలికలు సంబంధించిన నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ కేసులు నమోదు, నేరగాళ్ల నేర ప్రవృత్తి గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తు, నేరాలు అరికట్టేందుకు జిల్లా ఎస్పీలతో పాటు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది కష్టపడి పని చేస్తున్నారని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ - పోలీసు ప్రతిష్ట పెంచేలా ప్రతి అధికారి సిబ్బంది సమన్వయం తో కలిసి విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు దశల వారీగా పోలీసు శాఖకు మౌలిక వసతులు కల్పిస్తామని,ఈ క్రమంలో పోలీసు వాహనాలు, ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను అందిస్తామని పేర్కో న్నారు. శిక్షలు శాతం పెంచేందుకు మరింత కేసులు దర్యాప్తు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి బృందాలు ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులు నిర్వహించాలని, ప్రత్యేక కార్యాచరణతో డ్రాప్ బాక్స్ లను ఏర్పాటు చేయించాలని ఆమె అన్నారు. పురుష విద్యార్థులుకు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక ఒక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పై నైపుణ్యం కలిగి ఉన్న సిబ్బంది నియమించి సైబర్ కేసులు త్వరితగతిన చేధించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు వద్ద నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించి గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాలయాలు, గృహ సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని త్వద్వర నేరాలు నియంత్రణ తోపాటు నేరాలు చేధించేందుకు అధికారుల అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ లకు వచ్చే మహిళలు ఫిర్యాదుదారులు పట్ల పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారు సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.నేర నియంత్రణలో సాంకేతికతను, సిసి కెమెరాలను, డ్రోన్స్ వినియోగించాలన్నారు. నేర నియంత్రణలో సిసి కెమెరాలు, డ్రోన్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, సిసి కెమెరాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలని, ముఖ్య కూడళ్ళు, ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. హెూం శాఖామాత్యులు అనిత గారు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా అనిత గారుకి శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ తరుపున దుసాలువతో సన్మాంచి జ్ఞాపికలను రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి,జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి,ఇతర పోలీసు అధికారులు అందజేశారు. ఈ సమీక్ష సమావేశంలో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురాన,అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద, వివి అప్పారావు, అప్పారావు, శేషాద్రి, రాంబాబు, భవ్య రెడ్డి, రాఘవులు, శ్రీనివాసరావు, ఎస్బి సీఐ ఇమ్మన్యూవల్ రాజు, పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్య దీపిక భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - సోంపేట : ఇచ్ఛాపురం నియోజక వర్గంలో శ్రీశయన సామాజికవర్గ విద్యార్థులకు విశేష సేవలందిస్తూ అలాగే వైద్య శిబిరాల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీశయన చైతన్య దీపిక నూతన భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు చేతుల మీదుగా జరిగింది. స్థలదాత దుద్ది శ్రీనివాసరావు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొనగా చైతన్య దీపిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.వి.రామకృష్ణ, ముఖ్య సలహాదారు డాక్టర్ టి.వెంకటేష్, అధ్యక్షుడు దేవాడ మోహనరావు, ప్రధాన కార్యదర్శి దుద్ది వీర్రాజు, ఉపాధ్యక్షులు బీన ఆనంద్, పొడుగు కామేష్, ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. మండల పరిషత్ నిధులు తొలి విడతగా 2లక్షల రూపాయలు ఎంపీపీ డాక్టర్ దాసు ఇందు కోసం విడుదల చేశారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలి

విశాలాంధ్ర - కవిటి : అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులే కాకండా ఇంటి వద్ద ఉన్న 0 నుంచి 3 ఏళ్ల చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేరకు బుధవారం కవిటి సచివాలయంలో పంచాయితీ పరిధిలోని అంగన్వాడీ, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ లేని చిన్నారులందరికీ సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రంలో నమోదు చేయించే బాధ్యత మీదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో జి. వీరభద్రస్వామి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కవిత, పద్మావతి, శారద, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించిన సత్య సాయి సేవా సభ్యులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : శ్రీ సత్య సాయి సేవ సమితి మెట్టక్కువలస ఆమదాలవలస కన్వీనర్ కన్నెపల్లి వెంకట కామావదానులు ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించే కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమంలో పౌష్టికా హారాన్ని అందించిన దాత బిఆర్ నగర్కు చెందిన దన్నాన లక్ష్మి అందించిన పౌష్టికాహారాన్ని 70 మంది అం దుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాకులుగా కన్వీనర్ కన్నెపల్లి వెంకట్ కామవ దానులు, జి.మల్లేశ్వరరావు, కరకవలస, ప్రహ్లాద రావు, డాక్టరు పూసర్ల తాతయ్యలు, ఎస్జి రమణ, కే.మల్లేశ్వరరావు, ఐ.ప్రభారానీ, జిల్లా గ్రామ సేవలు ఇంచార్జ్ ఎం రవీంద్రబాబు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ధరలను తక్షణమే తగ్గించాలి



విశాలాంధ్ర - టెక్కలి : పెంచిన ఒంట గ్యాస్ సిలిండర్ల ధరలను తక్షణం తగ్గించాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేస్తూ టెక్కలిలో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతూ పేదలపై భారాలు వేస్తున్నాయని అన్నారు. మరోప్రక్క మతోన్మాదం పెంచుతూ పేదలను చీల్చే కార్యక్రమం చేపడుతున్నారు. బిజెపి తో చేతులు కలిపి కూటమి ప్రభుత్వంగా ఏర్పాటు అయిన నాటి నుండి రాష్ట్రంలో పేదల వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని సిపిఎం జిల్లా కమిటీ మెంబర్ నంబూరు షణ్ముఖరావు అన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను తక్షణం తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి యల్లయ్య,బగాది వాసుదేవరావు,బొంతు ధర్మారావు, కాంతారావు, దుర్గాప్రసాద్, హెచ్ ఈశ్వరరావు, సరస్వతి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీసీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మూడేళ్ల అనుభవం ఉన్న నాన్ టెక్నికల్ సిబ్బంది ఎన్టీసీ సర్టిఫికేటు పొందేందుకు ఆసక్తి ఉంటే ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణ లైనవారు ఈ ట్రేడ్ సర్టిఫికేటు పొందేందుకు వీలుందన్నారు.

కూటమి మున్సిపల్ చైర్మన్ కిరీటం ఎవరికి దక్కేనో..?

ఆశగా ఎదురు చూస్తున్న ఆశావాహులు...!

విశాలాంధ్ర - పలాస : పలాస అసెంబ్లీ నియోజకవర్గంకు తల మాణికమైన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ పదవి కోసం కూటమి పార్టీల్లోని నాయకులు తలో దారిలో ప్రయత్నాలు ఇప్పటి నుంచే ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ గా బల్ల గిరిబాబు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరో ఏడాది కాలంలో ఆయన ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతుంది. మున్సిపల్ ఎన్నికలు మరో ఏడాది కాలంలోగా జరగనున్నాయి. దీంతో ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. టిడిపి నుంచి పార్టీ సీనియర్ నాయకులు లోడగల కామేశ్వరరావు యాదవ్, సీనియర్ కౌన్సిలర్, పలు కార్మిక సంఘాల నాయకుడు దువ్వాడ శ్రీకాంత్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు లు మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. వీరిలో లోడగల కామేశ్వరరావు యాదవ్ ఇటు కింజరాపు కుటుంబంతోను, అటు గౌతు కుటుంబీకులకు అత్యంత సన్నిహితులు, ఆప్తుడు. మొదటి నుంచి పార్టీలో సీనియర్ కార్యకర్తగా ఉంటూ పార్టీ కష్టకాలంలో కూడా కార్యక్రమాలు నిర్వహించిన గుర్తింపు ఆయనకు ఉంది. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశించిన కామేశ్వరరావు యాదవ్ కు నిరాశ మిగిలింది. రెండో విడత, మూడో విడతలో కూడా ఆయనకు భంగపాటు కలగడంతో దీనిని సరిదిద్దేందుకు టిడిపి అధిష్టానం దృష్టి సారించి ఆయనకు న్యాయం చేయాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో కామేశ్వరరావు యాదవ్ కు పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ గా నియమిస్తే సరిపోతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిడిపి లో చేరి పెద్దల హామీ పొందిన దువ్వాడ శ్రీకాంత్ తనకు ఎలాగైనా చైర్మన్ గిరి కావాలన్నా పట్టుదలతో ఉన్నారని తెలుస్తోంది. అలాగే టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు కూడా పార్టీలో కీలకమైన నాయకుడిగా చలామనవుతున్నారు.తనకు కూడా చైర్మన్ పదవి కావాలని పార్టీ నేతలపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఇక కూటమి పార్టీలో భాగస్వామిగా ఉన్న బిజెపి, జనసేన పార్టీలకు చైర్మన్ గిరి కేటాయిం చాలంటూ ఆయా పార్టీల నుంచి డిమాండు ఉంది. ఈ పదవి కోసం జనసేన నుంచి మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రావు, బిజెపి నుంచి పాలవలస వైకుంతరావు చైర్మన్ పదవిని ఆశిస్తున్నారని ప్రచారంలో ఉంది. ఈ విషయమై ఆయా పార్టీల అధిష్టాన వర్గాలపై ఒత్తిడి ప్రారంభించారని తెలుస్తోంది. ఇంకా ఏడాది కాలం మున్సిపాలిటీ ఎన్నికలు ఉండగా ఇప్పటి నుంచే ఆయా పార్టీల నుంచి ఆశావాహులు చైర్మన్ పదవి కోసం పాకులాట ప్రారంభించడం పట్ల మున్సిపాలిటీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలి

విశాలాంధ్ర - పలాస : అర్హులైన విఆర్ఎలకు విఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాధరావు, జిల్లా కార్యదర్శి కె రమణ మూర్తి డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం విఆర్ఎలకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రంను పలాస ఆర్డిఓ కార్యాలయం ఏవో పాపారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫే స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. నామిని విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మణరావు కార్యదర్శి బి తిరుపతి రావు, ఉపాధ్యక్షుడు సిహెచ్ సింహాచలం, వెంకట్రావు, బైరాగి, బాను కుమారి, రేణుకా, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాల కోసం 11న ఐతమ్‌లో జాబ్‌మేళా

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11న తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ మరియు కర్మాగారాల శాఖ గుర్తింపు పొందిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టిఒఎంసిఒఎం) జాబ్‌మేళాను నిర్వహిస్తుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వర రావు బుదవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్ వంటి దేశాల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ఈ సంస్థ భాగస్వామ్యం కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. హెల్త్కేర్, నాన్హెల్త్కేర్ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిరుద్యోగులకు ఉపాది అవకాశాలు కల్పించుటకు ఈ సంస్థ కృషి చేస్తుందన్నారు. సౌదీ అరేబియా, కతార్, యుకె, కెనడా, జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, యుఎస్ ఎఎన్ఎం, జిఎన్ఎం, బిఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఆరోగ్య రంగంలో ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమో, బిటెక్, లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జపాన్, జర్మనీ, ఫిజి మరియు గ్రీస్‌లో ఆరోగ్యేతర రంగాల్లో ఉద్యోగాలు చేయుటకు అర్హులని డైరెక్టర్ వివరించారు. 40 ఏళ్ళ వయసున్న ఆసక్తిగల అనుభవం ఉన్న అనుభవం లేని అభ్యర్థులు సైతం ఈ మేళాలో పాల్గొని సర్టిఫికేట్లు, బయోడేటాతో హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు కోరారు. మరిన్ని వివరాలకోసం 8466096181, 9676339690 నెంబర్లకు సంప్రదించాలన్నారు ఆయన సూచించారు.

వస్త్ర వ్యాపారి అనుమానాస్పద మృతి

ధర్మపురం బావిలో మృతదేహం గుర్తింపు

విశాలాంధ్ర - పొందూరు : మండలకేంద్రం పొందూరుకు చెందిన వస్త్రవ్యాపారి ఉంగ్రాళ్ళ కిషోర్ కుమార్ (50) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందాడు. మండలం ధర్మపురం సమీపంలో బావిలో కిషోర్ మృత దేహాన్ని బుదవారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కిషోర్ గా గుర్తించారు. అయితే మృతుని భార్య అనూష భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. పిర్యాదుమే రకు పోలీసులు తెలిపిన వివరాలమేరకు కిషోర్ మంగళవారం రాత్రి దర్మపురంలో బాకీలు వసూలు చేసేందుకు వెళ్ళాడని బావిలో పొరపాటున కాలుజారి పడిపోయి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. పిర్యాదుమేరకు కేసు నమోదుచేసి వాస్తవాలు బయ టకు తీసేందుకు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని బయటకుతీసి శవపంచనా మా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె కుమారుడు ఉన్నారు.

మాదకద్రవ్యాలు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాలు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వ హించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ రాము మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం నేటి యువతలో తీవ్ర సమస్యగా మారిందని, దీనివల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయన్నారు. యువత భవిష్యత్తు ఎంతో విలువైనదని, అందుకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, దేశ నిర్మాణంలో భాగ్యస్వాంలు కావాలని సూచించారు. మాదకద్రవ్యాలు నియంత్రణపై వివిధ రకాల పోస్టర్లు ఆవిష్కరించారు. పరిసర ప్రాంతాలలో డ్రగ్స్ వినియోగం ఏ రూపంలో కనిపించినా టోల్ ఫ్రీ నెంబర్ 1972 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ పివిఎస్ ఆచార్యులు, బి.ఝాన్సీరాణి, సుగుణాధనరావు, కసవయ్య ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శులనే బాధ్యులను చేయడం తగదు

విశాలాంధ్ర - పొందూరు : ప్రభుత్వం చేపడుతున్న సర్వేలకు సచివాలయా లలో సచివాలయ కార్యదర్శులకు మాత్రమే బాధ్యతలు అప్పగించడం తగదని పొందూరు మండల కార్యదర్శులు అన్నారు. ఈమేరకు వినతిపత్రాన్ని మండల అభివృద్ధి అధికారికి బుదవారం అందించారు. కార్యదర్శులు వారి నిత్య విధులతో పాటు సర్వేలు చేయడం కష్టం గా ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్వేల బాధ్యత కేవలం కార్యదర్శికే అప్పగించడ కుండా సచివాలయంలో సిబ్బంది అందరికీ సర్వేల బాధ్యత అప్పగించాలని కోరారు. ఎ పీడీవోకు వినతిపత్రం అందించినవారిలో కార్యదర్శులు మోహన్ బాబు, పి.జగదీస్ రాజీవ్, ఎం.శ్రీనివాసరావు, రామకృష్ణ, జనార్ధనరావు, ఆర్.శ్రీను తదితరులు ఉన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్న అశోక్

విశాలాంధ్ర - కంచిలి : కంచిలి రైల్వే స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీరాముని నవరాత్రి ఉత్సవాల్లో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం మనసుకి చాలా ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. ఈ కార్యమ్రంలో అశోక్ తో పాటుగా జగదీష్ పట్నాయక్, బంగారు కూరయ్య, మద్దుల ఆనంద్, స్థానికులు పాల్గొన్నారు.

సామవేదం షణ్ముఖ శర్మ భక్తి ప్రవచనాలు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు గ్రామంలో వెంకటేశ్వర ఆలయంలో వసంత ఉత్సవాల్లో భాగంగా లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్‌రావు మరియు లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు ఆహ్వానం మేరకు భక్తి ప్రవచనాలు బోధించేందుకు విచ్చేసిన వాగ్దేవి వర పుత్ర, ప్రవచన విరించి, సమన్వయ సరస్వతి బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారినీ కోలాటాలతో, భక్తి పాటలతో స్థానిక మహిళలు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీక రించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోనీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో భక్తి ప్రవచనాలు బోధించారు. ఈ కార్యక్రమానికి స్వామిజీలు, పండితులు మరియు అశేష భక్త జనం హాజరయ్యారు.

మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించండి

విశాలాంధ్ర - కంచిలి : కంచిలి మండలం విద్యాశాఖ అధికారి ఎస్ శివరాం ప్రసాద్ మండలం లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు చేరుకొని ప్రభుత్వ పాఠశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డోల గోవిందపురం, రేఖ దేవిపురం ఉపాధి హామీ పనుల వద్ద కు చేరుకొని ప్రభుత్వ పాఠశాల లో ఉన్న విద్య మరియు మౌలిక సదుపాయాల కొసం అవగాహన కల్పించారు అలానే భోజన సదుపాయాల గురించి పౌష్టిక ఆహారం కోసం వివరించారు. ప్రభుత్వం నుండి వచ్చే పుస్తకాలు, యూనిఫామ్, బాగ్ అన్ని ఉచితంగా ఇస్తారని చెప్పారు.

కూటమి ప్రభుత్వం జగన్ పై కుట్ర..!

- సత్యసాయి జిల్లాలో పోలీసులు ఘోర వైఫల్యం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కుట్రకు పాల్పడుతుందని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం వైఖరిని తప్పుపడుతూ బుధవారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. అనంతపురం జిల్లా రామగిరి మండలం, సత్యసాయి జిల్లా పాపిరెడ్డి పల్లెలో మంగళవారం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పర్యటనలో ప్రభుత్వ యంత్రాంగం భద్రతా ప్రమాణాలు పాటించలేదని, జగన్మోహన్ రెడ్డిని చూసేందుకు ఎగబడిన జనాలను కంట్రోల్ చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. హెలిప్యాడ్ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన అరకొర సిబ్బంది పలు అనుమాలకు తావిస్తోందని రామారావు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయుడుకు ఇవ్వాల్సిన భద్రత ఇవ్వలేదని ఆరోపించారు. వందలాది మంది హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారంటే భద్రత సిబ్బంది వైఫల్యం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అభిమానుల తాకిడికి విండ్ షీల్డ్ దెబ్బతిన్నట్లు పత్రికల్లో వార్త వచ్చాయని ఆరోపించారు. భద్రతా ప్రమాణాల నేపథ్యంలో హెలికాప్టర్లో జగన్మోహన్ రెడ్డిని తీసుకువెళ్లలేమని సిబ్బంది చెప్పినట్లు వార్త చూసి ఆందోళన చెందినట్లు రామారావు తెలిపారు. రాష్ట్రం రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు.

పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

సిఐటియు నాగమణి డిమాండ్

విశాలాంధ్ర - ఆమదాలవలస : కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధర ను వెంటనే తగ్గించాలని సిఐటియు శ్రామిక మ హిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి జిల్లా అధ్యక్షు లు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశా రు. గ్యాస్ ధర పెంపుపై సిఐటీయు ఆధ్వర్యం లో ఆమదాలవలసలో పారిశ్రామికవాడ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కె ట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియో గదారులకు గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలు అందించాలి కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్ పై రు.50లు పెంచడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశా రు.గతంలో రూ:400లు ఉండే సిలిండర్ ధర రూ:880లకు పెరిగిందని దీనివల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగ దారులకు పెద్ద భారం పడుతుందని మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధి కారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని కార్పోరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలి స్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై సంవ త్సరానికి రు.400 కోట్ల భారం మోపుతున్నదని అన్నారు.గ్లోబల్ మార్కెట్ లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖాజానాను నింపే పనిలో ఉందని అన్నారు. పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజు సుంకాన్ని లీటర్ కు రూ:2లు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తాజా పెంపుతో లీటర్ పెట్రోల్ పై రూ:13లు, డీజిల్ పై రూ:10లు అమల్లోకి రానుందని అన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇందనాలపై 9సార్లు సుంకాన్ని పెం చిందని దీనతో కేంద్రానికి 99,000 కోట్ల ఆదా యం సమాకుర్చుకొందని విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరిం చుకోవాలని లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొడ్డేపల్లి జనార్ధన రావు బి.సూర్యనారాయణ, బి.హేమసుందర్, బి.రమణమూర్తి, జి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత..

విశాలాంధ్ర - టెక్కలి : స్థానిక జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణాలు జరిగాయని ఫిర్యాదుల మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి కాలనీలో దర్యాప్తు చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించిన విషయం అందరికీ తెలిసినదే. అయితే ఇటీవలే దర్యాప్తులో భాగంగా కొన్ని అక్రమ నిర్మాణాలు జరగడం వాస్తవమని, అలాంటి స్థలాలులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. బుధవారం జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన సుమారు 19 పునాదులు జెసిబి సహాయంతో కూల్చి వేసినట్లు తహసిల్దార్ రవికుమార్ తెలిపారు. అలాగే శ్రీనివాస్ నగర్ సమీపంలో ఉన్న చెరువు ప్రక్కనే ఉన్న అక్రమ నిర్మాణ పునాదులు కూడా తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు గాని, స్థలాలు గాని ఆక్రమిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నల్ల మట్టి పురుగు, తెల్లదోమ ల నివారణ పై అవగాహన

విశాలాంధ్ర - కంచిలి : కంచిలి మండలం కత్తివరం గ్రామంలో కొబ్బరి రైతులకు ఉద్యాన వన అధికారి మదుపీలత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొబ్బరి పట్టే నల్ల మట్టి ,తెల్ల దోమ నివారణకు కావలసిన బాధనికలు కోసం వివరించారు అలానే వాటిని ఎలా వాడాలో అవగాహన కల్పించారు. అలానే ఇటీవల కాలంలో వాడిన మఖారాం పురం గ్రామస్తులకు

కలిగే ప్రయోజనాల కోసం వివరించారు.

మార్కెట్ తరలింపుపై అపోహలు వద్దు : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : తన మాటే శిలా శాసనమని, పెద్దమార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైతే ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయడానికి ముందుకు వెళతామని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. పెద్ద మార్కెట్ పునర్నిర్మాణ పనుల కోసం ఈ నెల 15 లోగా ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా అధికారులకు ఆదేశించిడంపై వ్యాపారులంతా బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జాబితా తయారైన తర్వాత అందులో ఉన్న వ్యాపారులందరికీ స్థలాలు కేటాయింపుపై జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతనే మార్కెట్‌ను తరలిస్తా మన్నారు. మార్కెట్ తరలించేలోగా మూడు రకాల ప్లాన్‌లు తయారు చేయిస్తున్నామన్నారు. వీటిని మార్కెట్ వ్యాపారుల ముందు పెట్టి అందులో ఒక్క ప్లాన్‌కు అందరి సూచన మేరకు ఎంపిక చేస్తామన్నారు. భవిష్యత్తు తరలాకు ఉపయోగపడే విధంగా ఒక మోడల్ మార్కెట్‌కు రూపకల్పన చేస్తామన్నారు. కొనుగోలుదారులు, వినియోగ దారులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా మార్కెట్‌ను నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం చేపడతామన్నారు. అయితే నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరిన తర్వాతనే ముందడుగు వేస్తామన్నారు. పెద్ద మార్కెట్‌లో వ్యాపారులంతా సమావేశమై మార్కెట్‌లో ఉన్న వ్యాపారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. దీన్ని వ్యాపారుల సమక్షంలో చదివి జాబితాలో చేర్చిన వారి పేర్లు చదవి ఫైన ల్కెజ్ చేస్తానన్నారు. జాబితా సిద్ధమైన తర్వాతనే మార్కెట్ తరలింపు ప్రక్రియ ముందుకు సాగుతుందన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా షాపులు కేటాయింపు ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థి తుల్లోనూ అక్ర మాలకు అవకాశం ఇవ్వన న్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మార్కెట్ లోకి వెళ్లి ఖాళీ చేయా లని ఒత్తిడి తెచ్చారని, సమాచారం వచ్చిన వెంటనే ఆయన్ను వెనక్కి పిలిపించినట్టు తెలిపారు.

నేను మాట్లాడలేదు..

మార్కెట్ విషయంలో తాను ఇప్పటి వరకు ఏమీ మాట్లాడలేదన్నారు. అపోహలు నమ్మి ఆందోళన చెందవద్దని వ్యాపారులకు సూచించారు. కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మొదన్నారు. అరసవల్లిలో ఆదిత్యుని దేవాలయం అభివృద్ధి పనుల్లో ఏ మాదిరిగా 16 మంది నిర్వాసితులకు భరోసా ఇచ్చి అండగా నిలిచానో అదే మాదిరిగా మార్కెట్‌లో ఉన్న వ్యాపారులందరికీ న్యాయం చేస్తానన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఎప్పటి నుంచో పెద్దమార్కెట్‌కు రావాలని నిర్ణయించినా, సమయాభావం వల్ల తనని వెళ్లి రావాలని సూచించినట్టు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. మార్కెట్‌ను పరిశీలించిన సమయంలో ఎదురైన అనుభవాలు, అక్కడ నెలకొన్న పరిస్థితులను అంచనా వేశానన్నారు. మార్కెట్‌కు ఒక మంచి రూపం తీసుకురావాలని వ్యవసాయ, మార్కెట్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి ఎప్పటి నుంచో ఒక ఆలోచన ఉందని, బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఇటీవల మార్కెట్‌లో పర్యటించి ఈ నెల 15లోగా మార్కెట్‌లో అందరు వ్యాపారులను ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారని, అయితే ఆయన చెప్పిన తేదీ నాటికి ఖాళీ చేయించడం సాధ్యం కాదని అందరికీ తెలుసన్నారు. వీలైనంత తొందరగా ఖాళీ చేస్తే పనులు త్వరితగతిని పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్న ఆలోచనతో మంత్రి అచ్చెన్నాయుడు ఈ నెల 15వ తేదిని నిర్ణయించారని, అదే రోజుకు ఖాళీ చేయాలని వ్యాపారులపై ఒత్తిడి తేవడం లేదన్నారు. మార్కెట్ అభివృద్ధికి మంచి అవకాశం వచ్చిందని, దీనిపై వ్యాపారులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వైకాపా నాయకులు ఐదేళ్ల మార్కెట్‌ను పట్టించుకోలేదని, వైకాపా నాయకులు సవతి తల్లిప్రేమను నమ్మొద్దని వ్యాపారులకు సూచించారు. నేను పక్కా లోకల్.. తాను పక్కా లోకల్ వ్యక్తినని, ప్రజల మధ్యే 24 గంటలూ అందుబాటులో ఉంటు న్నానని, రాజకీయాల్లోకి డబ్బులు సంపాదించడానికి, అధికారదర్పం చూపించ డానికి, విలాసాలు చేయడానికి రాలేదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. 'నన్ను గెలిపించాలని కోరాను, గౌరవించి భారీ మెజార్టీతో గెలిపించారు. గెలిపించినందుకు అందరికీ మంచి చేయాలనే దృక్పధంతో పని చేస్తున్నాను. నేను అక్రమాలకు పాల్పడడం లేదు, నేను ఎవరి భూములు ఆక్రమించుకోలేదు, సెటిల్మెంట్‌లు చేయడం లేదు, ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయడం లేదు. ఎమ్మెల్యే అయిన తర్వాత ఎంతోమందికి వ్యక్తిగతంగా సాయం అందించాను. సాయం అందుకున్నవారికి తెలుసు నేను చేసానని' అంటూ ఎమ్మెల్యే శంకర్ భావోద్వేగంతో మాట్లాడారు. ఎవరి మాటలూ నమ్మొద్దని, నేరుగా తనని కలిసి మాట్లాడాలని సూచించారు. సమావేశంలో పెద్ద మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కుప్పిలి' కి మరో రాష్ట్ర స్థాయి బహుమతి

విశాలాంధ్ర - ఆమదాలవలస : రాష్ట్రస్థాయి కవితల పోటీలలో కుప్పిలి వెంకట రాజారావుకు ద్వితీయ బహుమతి లభించింది. కథలు కవితలు పోటీలు నిర్వహణలో కుప్పిలి తన స్థానాన్ని రాష్ట్రస్థాయిలో తన కవితాచాతు ర్యాన్ని పదిల పరుచుకున్నారు. పశ్చిమ గోదా వరి జిల్లా పెనుగొండ లోని చివటం సంగీత సా హిత్య కళా వేదిక రాష్ట్ర స్థాయిలో నిర్వహించి న కవితల పోటీల్లో కుప్పిలి వెంకట రాజా రావు రచించిన "సదా పదిలం" కవితకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు పోటీల నిర్వాహకురాలు గుండాల గీతా మహాలక్ష్మి సమాచారం పంపారు. 126 మంది కవితలు పోటీకి పంపగా రాజారావు కి ద్వితీయ బహుమతి లభించడం పట్ల పలువురు కవులు అభినందనలు తెలిపారు.

లాలాపేట దర్గా కొత్త కమిటీ

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : పట్టణంలో లాలాపేట హజరత్ యూషఫ్ షా టకియా (దర్గా) కొత్త కమిటీని మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాధిక్ పర్యవేక్షణలో కమిటీని ఏకగ్రాంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా ఎమ్డీ ఫరీద్, ఉపాధ్యక్షునిగా అబ్దుల్లా, కార్యదర్శిగా ఎస్. ఆలీ, కోశాధికారిగా తాజ్‌ఖాన్, సభ్యులుగా అక్తర్‌ఖాన్, ఇర్ఫాన్, జాకిర్, ఉస్మాన్, రఫీ, అలీంఖాన్‌లు ఎన్నికైయ్యారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస మండలం పరిధిలో తోటాడ, దూసి, అక్కివరం, వంజంగి తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఈ గ్రామాల్లో విద్యుత్తు లైన్లు మరమ్మత్తులు, చెట్లు కొమ్మల తొలగింపు వలన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా లో అంతరా యం కలుగుతుందన్నారు.విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : రైల్వే స్టేషన్ సమీపంలో పీర్లకొండకు వెళ్ళే మార్గం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుని వయస్సు సుమారు 20-25 ఏళ్ళు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జి.ఆర్.పి సిబ్బంది హరనాథ్ తెలిపారు.

సాగర తీర రక్షణకు 50 మంది పోలీసులు గస్తీ

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో సముద్ర తీరప్రాంతాలలో బుధవారం సాగర తీర కవచ్ డ్రిల్ లో భాగంగా పోలాకి సంబంధించి 50 మంది పోలీసులు గస్తీ లో పాల్గొన్నట్లు పోలాకి ఎస్ ఐ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు తీరం వెంబడి 5 బీటులు, 3 వెహికల్ చెకింగ్ పాయింట్లు, ఒక క్విక్ రియాక్షన్ టీమ్, ఒక పెట్రోలింగ్ పార్టీ, రెండు ల్యాండింగ్ పాయింట్లు, ముఖ్య ప్రదేశాల్లో బందోబస్త్ పెట్టడం జరిగిందని ఎస్ ఐ రంజిత్ తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : విద్యార్థి దశ చాలా కీలకమైందని, మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ కొళిగాం జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయిక్ అన్నారు. విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శించి, ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సి. హెచ్.జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఆర్డీవోకు వినతి

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించి, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో ఎం కృష్ణమూర్తిని బుధవారం కలిసి తమ సమస్యలపై వివరించి, వినతి పత్రాన్ని అందజేశారు. సీసీఎల్ఏ గతంలో ఇచ్చిన రూల్స్‌కు విరుద్ధంగా ప్రస్తుతం సీసీఎల్ఏ ఆఫీసు నుండి రాత్రిపూట డ్యూటీలు వేస్తూ సర్కులర్ జారీ చేయడం చాలా బాధా కరమని, తక్షణమే ఈ ఉత్తర్వులను ఉపసంహరించి వీఆర్ఏలకు భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రత, పే స్కేలు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్ఏ పోస్టులను భర్తీ చేయాలని, నామినేల్గా పనిచేస్తున్న వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించాలని వినతిలో కోరారు. వీఆర్ఏలు సమర్పించిన వినతి ఆర్డీవో కృష్ణమూర్తి సానుకూలంగా స్పందించారు. తమ సమస్యలపై ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని తెలియజేశారు.

రవీంద్ర భారతిలో కిడ్స్ కాన్వొకేషన్

విశాలాంధ్ర - ఆమదాలవలస : స్థానిక ఆమదాలవలస రవీంద్ర భారతీ పాఠశా లలో ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, వారి ఉజ్వల భవి ష్యత్తును తీర్చి దిద్దే దిశగా కృషి చేయాలని అన్నారు. కాన్వకేషన్ లాంటి గొప్ప కార్యక్ర మాలు చేయడం ద్వారా వారిలోని ఆత్మవి శ్వాసం పెరిగి వారికి మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. అంతేకాకుండా వారిలోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చు అని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల ఏమ్. టినేష్ మాట్లాడుతూ చిన్నారులలో ని సృజనాత్మక శక్తి సామర్థ్యాలు వెలికి తీయడానికి తోడ్పడే విధంగా ఈ విద్యా విధానం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి విధానాలు ద్వారా వారి భావి జీవితానికి మెరుగులు దిద్ద డం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమ ములో నార్త్ ఆంధ్రా జోనల్ ఇంచార్జ్ వెంకటేష్, సీ జీ యం వసంత, జీ యం.కె.రమ్య, చిన్నారులు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నారులు చేసిన పలు నృత్యా లు అందరినీ అలరించాయి.

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు మండలంలోని గూడెం పంచాయతీలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ టిడిపి కార్డులను పొందాలన్నారు. టిడిపి పార్టీ కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంగు రాజు, గండేటి భీమారావు, మాన్యల శరత్, దాసు, సాలసి రాజారావు, ఐతి జానికిరావు, సార మిన్నరావు, పువ్వల ఢిల్లీ, గండేటి యోగి మరియు గూడెం పంచాయతీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - టెక్కలి : వేసవికాలంలో రోజు రోజుకి పెరుగుతున్న ఎండల తీవ్రత దృశ్య టెక్కలిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పూర్వ ఏబీవీపీ ప్రముఖ్ తమ్మినేని ఆనంద రావు, బుర్ర నరేంద్ర చక్రవర్తి చేతుల మీదగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా వీలైనంతవరకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల యొక్క దాహాన్ని తీర్చాలని అన్నారు. మూగజీవాల కోసం ప్రత్యేకంగా తమ ఇంటి మేడపై గాని, పెద్ద వృక్షాలలో గాని మంచినీరును ఏర్పాటు చేసి మూగజీవాలు ప్రాణాలను కూడా కాపాడాలని, అప్పుడే ప్రకృతి మనల్ని ప్రాణాలతో కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కొన్ని మురళి, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మదన్, శ్యామ్, సంతోష్, అరవింద్, నరేంద్ర, మొదలగు ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.